మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## మల్లన్న దేవుని దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**



**సిద్దిపేట రూరల్, జనవరి 19, ప్రభాతవార్త :** మల్లన్న దేవుని దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని ఇర్కోడ్‌లో గుట్టపై వెలిసిన మల్లన్న దేవుని ఉత్సవాల్లో ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ కృషితో ఈ ప్రాంతానికి కాళేశ్వరం జలాలు వచ్చాయన్నారు. ఇర్కోడు మల్లన్న, కొమురవెల్లి మల్లన్న ఉత్సవాలు ఒకే రోజు జరగడం సంతోషంగా ఉందన్నారు. అనం తరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## రేషన్ కార్డుల సర్వే పారదర్శకంగా ఉండాలి : అదనపు కలెక్టర్ నగేష్



**కౌడిపల్లి , జనవరి 19, ప్రభాతవార్త :** క్షేత్రస్థాయిలో నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వే పగడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు ఆదివారం నాడు మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలో నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా మరియు పథకాల లబ్ధిదారులకు ఈ ప్రక్రియ ద్వారా వారికి తగు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న రేషన్ కార్డులది రైతు భరోసా ప్రక్రియను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఈయనతో పాటు ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం ప్రవీణ్ రెడ్డి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

## అక్కన్నపేట అభివృద్ధే లక్ష్యం

**అభివృద్ధి పనులను ప్రారంభించిన : మంత్రి పొన్నం**

**అక్కన్నపేట, జనవరి 19,ప్రభాతవార్త :** అక్కన్నపేట మండల కేంద్రంలోని బోడిగేపల్లి సేవాలాల్ తండా, బంజారా హిల్స్, గండిపల్లి, కుందనవానిపల్లి, మంజు నాయక్ తండాలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. మంజు నాయక్ తండ బీటీ రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి ధరావత్ తిరుపతి, గుగులోతు రాజు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా బంజారా వేషధారణలో గాన, నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ మంజు నాయక్ తండాలో కోటి 81 లక్షలతో బీటీ రోడ్డు వేశామని అలాగే బంజారాహిల్స్, సేవాలాల్ తండాలలో నీటి వసతి కోసం ట్యాంకులు ఏర్పాటు చేసి నల్లాల ద్వారా నీళ్లు అందిస్తామని తెలిపారు. బోడుగేపల్లిలో బీటీ రోడ్లు, కుందన్‌వానిపల్లిలో సీసీ రోడ్డు అలాగే రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ధరావత్ తిరుపతి నాయక్, గుగులోత్ రాజు నాయక్,డైరెక్టర్లు బైరవని శీను, కరంటూత్ రవి అర్జున్ నాయక్, భాస్కర్ నాయక్, శీను నాయక్, మల్‌రెడ్డితో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సోలార్ మంజూరులో అంతులేని అవినీతి!

## రెవెన్యూ రికార్డుల్లో గందరగోళం

### ఉన్న కుంటలు లేనట్లు.. లేని భూములు ఉన్నట్లు చూపిన వైనం

### టేక్మాల్‌లో సోలార్ కోసం కొన్నది ఎంత?.. ఉన్నది ఎంత?



ఎల్లంపల్లి సోలార్ ప్లాంట్, కాపువానికుంటలో మోటర్‌తో నీటిని ఎత్తి పోస్తున్న దృశ్యం (సర్కిల్‌లో)

**సంగారెడ్డి బ్యురో/టేక్మాల్, జనవరి 19 ప్రభాతవార్త:** సహజ విద్యుత్తును అందించాలని లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో ప్రవేశపెట్టిన సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల్లో భాగంగా మంజూరైన వాటిలో అవినీతి అక్రమాలు అధికారుల ఉదాసీనత స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో ముఖ్యంగా చెరువులు ఉండే ఫుల్ ట్యాంక్ లెవెల్ ఎఫ్‌టిఎల్ ప్రభుత్వ భూములు సాగుకు పనికి వచ్చే భూములను సైతం సోలార్ కంపెనీలకు కట్టబట్టారు. అప్పట్లో రెవెన్యూ శాఖ సంపూర్ణ సహకారాలు అందిస్తూ మండలంలో రికార్డులను తారుమారు చేసి గంధరగోళంలో ఉన్న విషయం తెల్సిందే. మెదక్ జిల్లాలోని టేక్మాల్ మండలంలో పలు సోలార్ కంపెనీలు ఉత్తమ ప్రాజెక్టు పనులను కొనసాగించి సోలార్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. టేక్మాల్ మండలంలో పల్వంచ, సాలోజిపల్లి,కాద్లూర్, కోరంపల్లి, ఎల్లంపలి, హసన్‌మహ్మద్‌పల్లి, టేక్మాల్ గ్రామాల్లో ఉన్న భూమిని రైతుల వద్ద కొనుగోలు చేసి సోలార్ యాజమాన్యానికి అప్పగిచ్చింది. అడ్డొచ్చిన ప్రభుత్వ భూములైన కుంటలను చెరువులను శిఖం భూములను సైతం కబ్జాలో ఉంది. సోలార్ యాజమాన్యం దళారులతో కలిసి ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటూ సోలార్ నిర్మాణాన్ని కొనసాగించింది. ఇందుకు సంబంధించిన అధికారులు, మధ్యవర్తులు తమ సొంత భూములను అప్పగించినట్లు ప్రభుత్వ భూములను సోలార్ యజమానులకు అప్పగించి తమకేం సంబంధం లేదని చేతులు దులుపుకున్నారు. టేక్మాల్ మండలంలోని కొందరు రైతులు ఇక్కడ కుంట ఉండేదని అది ఎక్కడ అని నిలదీస్తే ఏకుంట ఇక్కడలేదని చెప్పడంతో అప్పట్లోనరైతులు ఉన్నత అధికారులు సంప్రదించారు. అదే హసన్‌మహ్మద్‌పల్లి పరిదిలోని ఎర్రకుంట విషయంలో రైతులు సొలర్ పలకలు ధ్వంసం చేసిన విషయం తెల్సిందే. జింకొనిబాయి తండ పరిధిలోని కాపువానికుంటను సోలార్ కంపెనీ కంచె వేసి నిండిన నీటిని వర్షం పడ్డటప్పుడు ఆ వర్షం నీటిని తోడెస్తున్న విషయాన్ని వార్త కథనంతో అధికారుల ముందు పెట్టిన విషయం తెల్సిందే. ఇప్పటి వరకు ఉన్న కుంటలు ఎన్ని..? ప్రభుత్వ భూములు ఎన్ని..? సోలార్ కంపెనీలు కొనుగోలు చేసిన భూములు ఎన్ని వాటి తాలూకు రికార్డులు ఎవరిని అడిగినా తమకేం తెలియదంటూ చేతులెత్తేస్తున్నారు. ఏది ఏమైనా జిల్లా అధికారులు సైతం సమగ్ర విచారణ చేసి సోలార్ నిర్మాణంలో ప్రైవేయిట్ భూములెన్ని, ప్రభుత్వ భూములెన్ని, కుంటలెన్ని, కబ్జాలెన్ని అని లెక్క తెలాల్సి ఉంది.

### తహసీల్దార్ వివరణ

విషయమై ఆదివారం టేక్మాల్ తహశీల్దార్ తులసిరాంను వివరణ కొరగా సోలార్ కంపెనీలకు సంబందించి కొన్ని రికార్డులు మాత్రమే ఉన్నాయని మిగతా వివరాల కోసం ఆ సోలార్ కంపెనీలకు నోటీసులు అందజేశామన్నారు.

## పనులు నాణ్యతగా ఉండాలి : మంత్రి దామోదర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**చౌటకురు, జనవరి 19 ప్రభాతవార్త:** వసతి గృహాల్లో చేపడుతున్న నిర్మాణ పనులు నాసికరంగా కాంట్రాక్టర్లు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామో దర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలో నిర్వహి స్తున్న ఆయా శాఖల భవనాలను పరిశీలించి మాట్లాడారు. కస్తూ ర్బా గాంధీపాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి కాంట్రాక్టర్లుకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. బస్వపూర్ ఆదర్శ పాఠశాలకు చేరుకుని అక్కడ జరుగుతున్న భవనాల పనుల విషయంలో కాంట్రాక్టర్లుతో మాట్లాడుతూ పనులు త్వరగా చేయాలని పనుల్లో నాణ్యతగా ఉండాలని అన్నారు. మిగిలిన చిన్న చిన్న పనులను వెంట వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అందుతబాటులోకి తొందరగా తెచ్చేలా చూడాలని అన్నారు. సింగూరు గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో నప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని , విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నెల రోజుల నుంచి పాఠశాలలో మౌళిక సౌకర్యాలు మెరుగుపడ్డాయని అందుకు కృషి చేసిన మంత్రికి విద్యార్థులు ధన్యావాదాలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు కలిసి తమ సమస్యలను విన్నవించాలని మంత్రిని కోరాగా మంత్రి స్పందిస్తూ తప్పకుండా మీ సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తా నని అన్నారు. అనంతరం ముద్దాయిపేట చౌరస్తాలో కాపేపు కూర్చుండి చాయ్ తాగి నాయకులతో మాట్లాడారు. ఆర్డీఓ పాండు, డిప్యూటీ ఎమ్మార్వో కృష్ణ, జోగిపేట సిఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### నేటి ప్రజావాణి రద్దు : జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారులు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇం దిరమ్మ ఇండ్ల కార్యక్రమాల సర్వే నిర్వహణలో ఉన్నందున ఈనెల 20న కలెక్టరేట్‌లో నిర్వహించ తలపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం కలెక్టరేట్‌కు ప్రజలు ఎవరూ రావద్దన్నారు.

### ప్రజలకు అందుబాటులో ఉండే నాయకునికే గుర్తింపు

**ఎమ్మెల్యే, ఎంఐఎం పార్టీ ఇంచార్జ్ కౌసర్ మోయుద్దిన్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ జనవరి 19, ప్రభాతవార్త :** ప్రజలకు అందుబాటులో ఉండే నాయకునికే గుర్తింపు లభిస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే,ఉమ్మడి మెదక్ జిల్లా ఎంఐఎం పార్టీ ఇంచార్జ్ కౌసర్ మోయొద్దిన్ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అధికారిక పదవులు ఉన్నా లేకపోయినా ప్రజాక్షేత్రంలో ఉండే నాయకుడే అసలైన నాయకుడని అన్నారు.కార్యకర్తల ఆమోదం మేరకు సంగారెడ్డి పట్టణ అధ్యక్షునిగా ఫాజిల్ ఇర్ఫాన్ ను, ప్రధాన కార్యదర్శిగా యాఖుబ్ లను ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సమద్ బిన్ అబ్దాత్ తెలిపారు సంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా అడ్వకేట్ నిజాముద్దీన్ పేరును ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జహీరాబాద్ సదాశివపేట నారాయణఖేడ్ సంగారెడ్డి మండలాలకు చెందిన ఎంఐఎం నాయకులు మాట్లాడారు. సంగారెడ్డి పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే కౌసర్ మోయుద్దిన్ శాలువాలతో సన్మానించారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాల చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



నూతన అధ్యక్షుణ్ణి సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మోయొద్దిన్

# బిజెపి అధ్యక్ష పదవి బిసిలకా...రెడ్లకా?

### త్వరలోనే ప్రకటన..ఆశావాహుల ముమ్మర ప్రయత్నాలు



బైరి శంకర్ | దూది శ్రీకాంత్‌రెడ్డి | అంబటి బాలేష్‌గౌడ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా బిజెపి అధ్యక్ష పదవిని దక్కించుకోవడానికి సీనియర్ నాయకులు గత కొద్ది రోజుల నుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి దక్కించుకోవాలన్న పట్టుదలతో ముగ్గురు సీనియర్ నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. సిద్దిపేట జిల్లాగా అవతరించినప్పటి నుంచి నేటి వరకు బిజెపి జిల్లా అధ్యక్షులుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే కొనసాగుతూ వస్తున్నారు. ఈ సారి ఎలాగైనా జిల్లా అధ్యక్ష పదవి దక్కించుకోవాలన్న పట్టుదలతో ఇద్దరు బిసి నాయకులు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లా పార్టీ అధ్యక్ష పదవి పగ్గాలు దక్కించుకోవడానికి సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోని బండా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బైరి శంకర్(ముదిరాజ్), దుబ్బాక పట్టణానికి చెందిన అంబటి బాలేష్ గౌడ్ ప్రస్తుత అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డిలతో పాటు గజ్వేల్ ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు నాయకులు సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నాయకులు తాము నమ్ముకున్న నేతల చుట్టూ ఇప్పటికే పలు మార్లు చక్కర్లు కొట్టినట్లు సమాచారం. కాగా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో పార్టీ అధిష్టానం మాత్రం సమర్థవంతమైన నాయకునికి పార్టీ పగ్గాలు అప్పగించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. పార్టీ అధిష్టానం ఈ సారి పార్టీ జిల్లా అధ్యక్ష పగ్గాలు బిసిలకు అప్పగిస్తే బైరి శంకర్ ముదిరాజ్‌కు లేదా అంబటి బాలేష్‌గౌడ్‌కు దక్కె అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఒక వేళ మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయిస్తే తిరిగి తనకు పదవి ఇవ్వాలని గంగాడి మోహన్‌రెడ్డి కోరుతున్న పార్టీ శ్రేణులు మాత్రం అయిన పై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే మరో నాయకుడు దూది శ్రీకాంత్‌రెడ్డి గతంలో జిల్లా అధ్యక్షునిగా పని చేసిన అనుభవం ఉండడంతో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తుంది. వీరికి తోడు గజ్వేల్ ప్రాంతానికి మరో ఇద్దరు అధ్యక్ష పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే అధ్యక్ష పదవి ప్రకటన రానుండడంతో ఎవరిని వరిస్తుందో వేచి చూద్దాం మరి.



రాజగోపురం వద్ద భక్తులు



బోనాలతో వస్తున్న భక్తులు

## మల్లన్న క్షేత్రం భక్తజన సంద్రం

**పట్నం వారానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులు**

**మల్లన్న నామ స్మరణంతో మార్మోగిన ఆలయం**

**కొమురవెల్లి, జనవరి 19, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున సా ్వమి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణంతో శైవక్షేత్రం పులకరించింది. శివసత్తుల చిందులు, పూనకాలతో మల్లన్న ఆలయం మార్మోగింది. మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారం పట్నం వారంతో జాతర ప్రారంభమైంది. పట్నం వారం మొదటి ఆదివారం సందర్భంగా హైదారాబాద్ నగరానికి చెందిన వేలాది మంది భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు గంటల సమయం పట్టింది. పట్నం వాసులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి సా ్వమి వారిని దర్శించుకోవడంతో పాటు సోమవారం పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు దాటడంతో మొదటి వారానికి పట్నం వారంగా పేరు వచ్చింది. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం,కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామి వారి సోదరి ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తి శ్రద్దలతో భోనం తయారు చేసి కొండపైకి తీసుకుపోయి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అలయ ఈవో రామాంజనేయులు, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జన్ దగ్గరుండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా హుస్నాబాద్ ఎసిపి సతీష్, చేర్యాల సిఐ శీనుల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు

**-రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ**
**గ్రామసభలలో అర్జీలు స్వీకరణ**
**-21వ తేదీ నుంచి గ్రామసభల నిర్వహణ**
**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ రూరల్, జనవరి 19 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు గ్రామసభలలో అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. ఆదివారం మెదక్ మండల పరిధిలోని పాతూర్ గ్రామంలో కొత్త రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతన రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని తెలిపారు. ఇంతకు ముందు జరిగిన సర్వేలలో ఎప్పుడు దరఖాస్తు ఇవ్వకపోయినా గ్రామ సభలలో వాళ్ళ చేత కొత్త దరఖాస్తులు తీసుకోబడుతాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యంగా వివరించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా సామాజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వే ఆధారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 ప్రతిష్టాత్మక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభలలో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు స్వీకరించాలని ఆయన స్పష్టం చేశారు. గతంలో స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 26న ప్రారంభించనున్న నాలుగు పథకాలపై 21వ తేదీ నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయలు, ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు గ్రామసభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎంపిడివో కార్యాలయాల్లో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉన్నవారు, ఇంటిస్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామసభలలో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని ఆయన సూచించారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీకి అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా అందించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా పథకం కింద ప్రతి సీజన్‌కు రూ.6,000 చొప్పున సంవత్సరానికి 12,000 రూపాయలు ప్రతి ఎకరానికి ఇవ్వబడుతుందని చెప్పారు. ప్రతి నిరుపేద భూమి లేని కుటుంబానికి 2023-24 సంవత్సరానికి 20 రోజుల ఉపాధి హామీ పని చేసి ఉంటే ఆ కుటుంబానికి ప్రతి సీజన్‌కు 6,000 రూపాయల చొప్పున సంవత్సరానికి 12,000 రూపాయలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద ఇవ్వబడుతుందన్నారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు, రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూములు, రియల్ ఎస్టేట్ భూములు తదితర వ్యవసాయానికి పనికి రాని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో విచారణ టీమ్‌లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసాకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.



రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## చివరి లబ్ధిదారుని వరకు ప్రభుత్వ పథకాలు అందించాలి

**జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి బ్యూరో జనవరి 19, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. ఆదివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్ల లోని ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు ఎంపీడీవోలు తహసిల్దార్లు నియోజకవర్గం ప్రత్యేక అధికారులతో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఈనెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ వంటి పథకాలపై, ఈనెల 21 నుండి చేపట్టనున్న గ్రామసభలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారిచేసినట్లు కలెక్టర్ అధికారులు వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 ప్రతిష్టాత్మక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 21 వ తేనుండి 24 వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు


పోస్టర్ ఆవిష్కరించిన ఎన్నారై డాక్టర్ సతీశ్ కత్తుల

## 27 నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్

**హైదరాబాద్, జనవరి 19 ప్రభాతవార్త :** తెలంగాణ జిల్లాల అండర్ 17 టీ20 క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 27 నుంచి ఆరంభం కానుంది. హైదర్‌గూడలోని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నారై వైద్యులు నాథ రమణమూర్తి గోకుల, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పోస్టర్‌ను ప్రముఖఅంకాలజిస్ట్, భారత సంతతి అమెరికా వైద్యుల సంఘం అధ్యక్షుడు సతీశ్ కత్తుల ఆవిష్కరించారు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చెందాలని, ఈ టోర్నమెంట్ నిర్వహణతో ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రానుండటం అభినందనీయమని ఈ సందర్భంగా సతీశ్ కత్తుల అన్నారు. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి 9 జిల్లాలు సహా టీడీసీఏ ఎలెవన్ జట్లు పోటీపడుతున్నాయి. టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రికెటర్ల నుంచి మూడు జట్లను తయారు చేస్తాం. మార్చి మూడో వారంలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టు ఇక్కడికి రానుంది. తెలంగాణ ఉమ్మడి జిల్లాల జట్లు, అమెరికా క్రికెట్ అకాడమీ జట్టుతో పోటీపడనున్నాయి. అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అనుభవం తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు దక్కనుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల కన్వీనర్లు మహ్మద్ మతీఫ్, సురేందర్ రెడ్డి సహా కుమారస్వామి, బసివి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

### చిలుక మధుసూదన్ రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చిలుక మధుసూదన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్మెట్, జనవరి 19 ప్రభాతవార్త:** అనాజ్‌పూర్ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఏపీఎల్10 అనాజ్‌పూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్–10 బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం అనాజ్ పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచిన టీవిస్ టీమ్, ద్వితీయ స్థానంలో గెలిచిన ఓంసాయిరాం టీమ్‌లకు బహుమతులు, నగదును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ బహుమతి స్పాన్సర్స్ తాటిపల్లి విష్ణు గౌడ్, ఎర్రోలి బాలకృష్ణ గౌడ్, బ్యాక్ గ్రౌండ్ స్పాన్సర్ కందిగారి మహేందర్, కందిగారి చంద్రబాబు, గ్రౌండ్ క్లీనింగ్ స్పాన్సర్స్ యెర్పుల భాను, స్పాన్సర్స్ గుర్రని మురళి గౌడ్, యెర్పుల సమయ్య, కె వెంకట్‌రెడ్డి, ఉప్పుల సురేష్, టీమ్ స్పాన్సర్స్ ఆ మహేందర్, ఏమ్ కరుణాకర్ రెడ్డి, కె.ఎంకే, టి నవీన్ గౌడ్, ఎస్ శంకర్, ఆర్ వివేక్, అనాజ్ పూర్ ప్రీమియర్ లీగ్ –10 నిర్వాహకులు మహేష్,హరికృష్ణ, సురేష్,సోనూ,సన్నీ,నరేష్, క్రీడాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బిజెపి హయాంలోనే దేశం అభివృద్ధి


రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్యను కలిసిన చార్మినార్ బిజెపి నాయకులు

**చార్మినార్, జనవరి 19 ప్రభాతవార్త :** బిజెపి రాజ్యసభ సభ్యులు ఆర్. క్రిష్ణయ్యను ఆదివారం చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బిజెపి మాజీ మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, తెలంగాణ ఓబిసి మోర్చ అధికార ప్రతినిధి అణుగంటి రాజు నేథ, బిజెపి నాయకులు సయ్యద్ నజాఫా అలీ షొకర్‌తో పాటు పలువురు రాజ్య సభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్యను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ బిజెపి హయాంలోనే దేశం అన్ని రంగాలలోను పురోగతిని సాధించిందని తెలిపారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి

**చిక్కడపల్లి, జనవరి 19 ప్రభాతవార్త:** పాట, సంగీతం ద్వారా మనిషి ఆయురారోగ్యాలతో ఉండవచ్చని వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో రసరాగవాహిని ఆధ్వర్యంలో 'సంగీత విభావరి' కార్యక్రమం నిర్యాహకులు పొన్నపల్లి రవిశంకర్, కామేశ్వరి ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా గాయనీ గాయకులు చిదంబరశాస్త్రి, శ్రీనివాసమూర్తి, రాజ్యలక్ష్మి, సీతామహాలక్ష్మి, రాజశ్రీ, కనకదుర్గ, కృష్ణ మోహన్, రామచంద్రమూరినత, దివాకర్, లక్ష్మీప్రసూన, వాణిమోహన్, పద్మ, సువర్చల, ప్రసాద్, ప్రసూన, శశికళ, భార్గవి, లక్ష్మీ తదితరులు అద్భుతంగా గానం చేశారు. డాక్టర్ వంశీ రామరాజు తాను ఘంటసాలకు గుడి కట్టించానని, వికలాంగులకు వేగేశ్న ఫౌండేషన్ ద్వారా విశేషంగా సేవలను అందిస్తున్నానన్నారు. త్యాగరాయ గానసభ ఎన్టీఆర్, ఎఎన్నార్, బిస్మిల్లాఖాన్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, హేమామాలిని తదితర మహనీయులు సత్కారాలు పొంది నడయాడిన ప్రదేశమని, అటువంటి వేదికపై కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు సంగీతం, పాటలను పాడడంలో శిక్షణ ఇప్పించాలని, ఎంతో గౌరవం ఉంటుందన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వంశీ రామరాజు, పొన్నపల్లి రవిశంకర్, కామేశ్వరి, గాయనీ గాయకులు

# కోర్టు కేసులున్న స్థలాల క్రయవిక్రయాలు చెల్లవు



ధర్నా చేస్తున్న ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ నాయకులు

**ధర్నాచౌక్, జనవరి 19, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్‌పరిధిలోని రాజగోపాల్‌నగర్‌లోని సర్వే నెంబర్ 119 నుండి 220 వరకు దాదాపు 408 ఎకరాల భూమి కోర్టు కేసులో ఉన్న కారణంగా ఆ స్థలాలకు సంబంధించి క్రయవిక్రయాలు చెల్లవని ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. ఆదివారం ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు, ప్లాట్ యజమానులు ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోర్టు కేసు పరిధిలోఉన్న స్థలాల రిజిస్ట్రేషన్లు, కొనుగోళ్లు నిషేధితం, అటువంటి స్థలాలు ఎవరైనా కొనుగోలు చేసినా, అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 40 ఏళ్లకు ముందు లేఅవుట్ లోని ప్లాట్లను తామంతా కొనుగోలు చేశామని, ఇటీవల కొందరు స్థానిక నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి, కొంత భూమిని కబ్జాచేశారని ఆరోపించారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా కొందరు నాయకులు సర్వే నెంబర్లు మార్చేసి, తప్పుడు పత్రాలు సృష్టించి, తక్కువ ధర ఆశచూపిస్తూ అమాయక ప్రజలకు కట్టబెడుతున్నారని అన్నారు. కొందరు అధికారులు ధనదాహంతో అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు, ఇంటి పర్మిషన్లు, నల్లా కనెక్షన్‌లు, డ్రైనేజి అనుమతులు ఇస్తున్నారని, ఇవన్నీ న్యాయస్థానం దృష్టిలో ఉన్నాయని హెచ్చరించారు. నోటరీ రిజిస్ట్రేషన్లు, జీపీఏ వంటి డాక్యుమెంట్లు సేల్‌డీడ్‌తో సమానం కావని, అవి యజమాని హక్కులను బదిలీ చేయవని సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. గతంలో ఈ లేఅవుట్‌లో అక్రమనిర్మాణాలపై అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారని తెలిపారు. ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ లేఅవుట్‌లో కోర్టు పరిధిలో ఉన్న సర్వే నెంబర్ల స్థలాలను ప్రజలెవరూ కొనటం కానీ, కట్టడాలు చేపట్టటం కానీ చేయవద్దని, లోకల్ మాఫియా నాయకుల్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సందీప్‌కుమార్, కోశాధికారి కె.రమేష్, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, కార్యదర్శి మాధవి, కార్య నిర్వాహక కార్యదర్శి బి.సుదర్శన్ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల లబ్దిదారుల ఎంపికకు

## రేపటి నుంచి వార్డు సభలు : కమిషనర్ సాబేర్ అలీ

**నిజాంపేట్, జనవరి 19, ప్రభాతవార్త** ఇందిరమ్మ ఇళ్లు, రేషన్కార్డుల జారీ కోసం అర్హులైన వారి ఎంపిక కార్యక్రమంలో భాగంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఆయా డివిజన్లల్లో జరిగే వార్డు సభల్లో మేయర్, డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ నెల 21నుంచి 24 వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12వరకు, మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు విడతలుగా గ్రామసభలు కొనసాగుతాయని కమిషనర్ పేర్కొన్నారు.

**21న వార్డు సభలు జరిగే ప్రాంతాలు..**

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు క్రాంతినగర్ కమ్యూనిటీహాల్, మంజీరా ఓవర్హెడ్ వాటర్ ట్యాంక్ సమీపంలోని శిల్పపార్కు, ఎన్ఎంసీ కార్యాలయం సమీపంలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, ఎన్టీఆర్‌నగర్ 191 బస్తీ దవాఖానా, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంచతత్వ పార్కు, మోర్ స్టోర్ వెనుకాల శ్రీకృష్ణా సీనియర్ సిటిజన్ ఆఫీస్, ఓవర్హెడ్ అంగన్వాడి స్కూల్, శ్రీబాలాజీ టవర్స్, ఆదిత్య లాగూన్ ప్రాంతాల్లో వార్డు సభలు ఉంటాయని తెలిపారు.

**22న వార్డు సభలు జరిగే ప్రాంతాలు..**

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు భవ్యాస్ క్లబ్ హౌస్, కేటీఆర్ కాలనీ పార్కు, జేఎన్ఎన్యూఆర్ఎం ఫేజ్1, నల్లపోచమ్మ టెంపుల్, మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎల్లమ్మ టెంపుల్ సమీపంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్, బస్తీ దవాఖానా, నారాయణ రెడ్డికాలనీ కమ్యూనిటీ హాల్, రాజీవ్ గాంధీనగర్ రోడ్డు నెంబర్ 6 పోచమ్మ టెంపుల్ సమీపంలో వార్డు సభలు కొనసాగుతాయన్నారు.

**23న జరిగే ప్రాంతాలు..**

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కౌసల్యకాలనీ చిల్డ్రన్స్ పార్కు సమీపంలో, బాచుపల్లి వార్డు కార్యాలయం, సాయినగర్ బస్తీ దవాఖానా, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు వినాయక చిల్డ్రన్స్ పార్కు, ఇందిరానగర్ విలేజ్, ప్రగతినగర్ జెడ్పీహెచ్ఎస్, సాయి విలేజ్ పార్కింగ్ ప్రాంతాలు.

**24న జరిగే ప్రాంతాలు..**

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్టీఆర్ పార్కు, బండారి లేఅవుట్ రోడ్డు నెంబర్78లోని లైబ్రరీ, బ్లాక్1 వినాయక షెడ్డు, బ్లాక్ 94 అంగన్వాడీ సెంటర్, మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు ప్రశాంతిల్స్ పార్కు, నిజాంపేట వార్డు ఆఫీస్, శ్రీరామకుంట సమీపంలోని రామాలయం, బ్లాక్ 54 సమీపంలోని చిల్డ్రన్స్ పార్కు ప్రాంతాల్లో గ్రామసభలు కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు.

## కనీస సదుపాయాల కల్పనకు కృషి

### కౌన్సిలర్

**హయత్‌నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** వార్డుపరిధిలోని అన్ని కాలనీల్లో కనీస సదుపాయాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు. వార్డుపరిధి లక్ష్మారెడ్డి పాలెంలోని సూర్యవంశికాలనీ, శ్రీనగర్‌కాలనీ, మల్లికార్జుననగర్ కాలనీలో సుమారు 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయిస్తూ అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే తమ పదవి కాలం పూర్తవుతుందని... పదవులు ఉన్నా లేకున్నా ప్రజలకు నిత్యం అందుబాటులోఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. శివారు మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయనున్న నేపథ్యంలో ఇళ్ల అనుమతులు, తాగునీటి కనెక్షన్లను వేగవంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

### ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**ముషీరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఇవ్వవలసిన పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దోమలగూడలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై నర్సి రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల చెల్లింపులు వాయిదా వేయటం కోసం ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని ప్రభుత్వం ఆలోచన చేయటం సరికాదని, తక్షణమే ఆ ప్రతిపాదన విరమించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి, సంఘాలతో చర్చించి, జులై 2023 నుండి అమలు చేయాలని, బకాయి పడిన నాలుగు వాయిదాల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం విద్యకు కేటాయించాలని, ఎన్ఈపీ 2020 ని రద్దు చేయాలని, జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దుచేసి, పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, పొదుపు మొత్తాలపై రాయితీని 5 లక్షలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేసి, సమావేశంలో ఆమోదించారు. టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్, ఉపాధ్యక్షులు కే.జంగయ్య, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, రాములు, జి.సమ్మారావు, కే.రంజిత్‌కుమార్, జి.నాగమణి, డి.సత్యానంద్, మల్లారెడ్డి, శ్రీధర్, రవికుమార్, రవిప్రసాద్‌గౌడ్, జ్ఞానమంజరి, సింహాచలం, వెంకటప్ప, యాకయ్య, ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు-

## లక్ష డప్పులుతో భారీ మహా ప్రదర్శన

**చిక్కడపల్లి, జనవరి 19 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ "వెయ్యి గొంతులలో లక్షడప్పులుతో భారీ మహా ప్రదర్శన నిర్వహించబోతున్నట్లు ముషీరాబాద్ నియోజవర్గం ఇంచార్జ్ రామారావు శ్రీనివాస్‌మాదిగ వివరించారు. ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్ హరినగర్ బస్తిలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ మహనీయుల విగ్రహాల నివాళులర్పించిన అనంతరం రామారావు శ్రీనివాస్ మాదిగ. గండి కృష్ణ మాదిగ ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్ మాదిగ, సీనియర్ నాయకుడు చిలక ఎల్లయ్య మాదిగ. తాండ్ర మురళీ మాదిగ. అమ్ముగూడెం దశరథ్ మాదిగ. ముచ్చనపల్లి రాములు మాదిగ, గజ్జల వినయ్ కుమార్ మాదిగ. ఇల్లందు ఎల్లయ్య మాదిగ. రోషన్ వినయ్ రావు మాదిగ. పాపిడి రాజమాదిగ. లక్ష్మీ గల్లా నర్సింగ్ రావు మాదిగ. తదితరులు పాల్గొన్నారు, ర్యాలీగా బస్తీలో తిరుగుతూ డప్పులు వాయిస్ వెయ్యి గొంతులు లక్ష డప్పులు భారీ మహా ప్రదర్శనను మాదిగలు, మాదిగ ఉప కులాలు బస్తీలో ప్రతి ఇంటి నుంచి ఒక్క డప్పు భుజాన వేసుకొని ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరగబోయే 1000 గొంతులు లక్ష డప్పులు భారీ మహా ప్రదర్శనని విజయవంతం చేద్దాం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

### బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్‌కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

**చిక్కడపల్లి, జనవరి 19 ప్రభాతవార్త:** న్యాయవాదులు ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషిచేయాలని కేంద్ర కార్మికమంత్రిత్వ శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు అన్నారు. బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్‌కోర్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘురామ్‌రెడ్డి, ఎం.మధుసూదన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రాంతీయ లేబర్ కమిషనర్ సునీల్ కుమార్ సాహు, అసిస్టెంట్ లేబర్‌కమిషనర్ రాఘవేంద్ర, అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.తిరుపతిరెడ్డి, వై.రంజిత్‌రెడ్డి, కోశాధికారి బి.కిరణ్‌కుమార్, కార్యవర్గసభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.

### ఘనంగా బేతనియ బాప్టిస్టు చర్చి వార్షికోత్సవ వేడుకలు

**మలక్‌పేట, జనవరి 19 ప్రభాతవార్త :** క్రీస్తుజీవనం అందరికీ అదర్శమని... సహనం, ప్రేమ, కరుణ, శాంతి విలువలను ఏసుప్రభువు ప్రపంచానికి చాటారని హైదరాబాద్ యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ రెవెరెండ్ డా.జాయ్ చరియన్ అన్నారు. మూసా రాంబాగ్ కృష్ణతులసినగర్‌లోని బేతనియ బాప్టిస్టు చర్చి 19వ వార్షికోత్సవ వేడుకలను చర్చిఫాస్టర్లు రెవెరెండ్ సామ్యూల్‌బాబు బైరపోగు, షీలాడోరతి బైరపోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాన్‌మోజన్, కిషోర్‌బాబు, ప్రశాంత్, సత్యా నందం, సుకుమార్, సుధీర్, ప్రియాంక, రమణ, లీన పాల్గొన్నారు.

# ప్రజా వీరుడు పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


జిల్లెలగూడ మినీ ట్యాంకు బండ్‌పై పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** అన్యాయాలకు, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగర శివార్లలో మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దబడుతున్న మహేశ్వరం నియోకవర్గంలోని బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌నున్న జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పండుగ సాయన్న భారీ విగ్రహం ఆవిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, మహేశ్వరం బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్, ముదిరాజ్ ప్రముఖులు నీలం మధు, బొర్ర జ్ఞానేశ్వర్ తదితరులతో కలిసి పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ పండుగ సాయన్న జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జీవిత చరిత్ర భవిష్యత్ తరాల వారికి కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, దొరలు, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలని అన్నారు. కనుమరుగైన గొప్ప గొప్ప వీరుల చరిత్రలను సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో పండగ సాయన్న జయంతిని అధికారికంగా జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల మేయర్లు ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట్ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, గడ్డమీది రేఖ లక్ష్మణ్ ముదిరాజ్, పాలమూరి విజయలక్ష్మి రాజు ముదిరాజ్, స్థానిక కార్పొరేటర్ పోరెడ్డి పద్మ భాస్కర్‌రెడ్డి, స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, దయానంద్ ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, దండు గణేష్ ముదిరాజ్‌లతో పాటు రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కర్రోళ్ళ చంద్రయ్య ముదిరాజ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పాలపర్తి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**సరూర్‌నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని జిల్లెలగూడ చందన చెరువు సమీపంలో ఆదివారం సృష్టి ఆక్యుపంచర్ అండ్ నేచరోపతి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆక్యుపంచర్ అండ్ నేచరోపతి వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆక్యుపంచర్, నేచరోపతి వైద్యం ద్వారాం ఎటువంటి మందులు లేకుండా కొన్ని రకాల జబ్బులను నయం చేసుకోవడం హర్షణీయమన్నారు. ఇలాంటి క్యాంపును నిర్వహించిన వారిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, ఎనుగుల అనిల్ యాదవ్, నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, సిద్దాల అంజయ్య, వంటేరు నర్సింహారెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సునీత బాలరాజ్, విజయలక్ష్మిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రజక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ఎల్.బి.నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రజక వృతిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి రూపొందించన 2025నూతన సంవత్సరం క్యాలెండర్‌ను చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు గత ప్రభుత్వం 250 యూనిట్‌ల ఉచిత కరంట్, మోడరన్ దిబిగాట్లు, రజకులకు ఆత్మ గౌరవ భవనాలు మంజూరి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో దండు నిరంజాన్, డివిజన్ అధ్యక్షులు యు. మల్లేష్, డి. రాకేష్,. బి.సంజయ్ కుమార్, జి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : చింతల

**ఎల్.బి.నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** కాలనీలలో పెండింగులో ఉన్న సమస్యలను ప్రణాళిక అబద్ధంగా పరిష్కరిస్తామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ మమత నగర్ లో నూతన పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నాగోల్ ఇన్స్పెక్టర్ సూర్యనాయక్, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులు ఉదయం వాకింగ్‌కి రోడ్ల పైకి వెళ్లకుండా అందరూ ఈ పార్కును వినియోగించుకోవాలని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి మొక్కలు వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీధర్, ప్రభావతి, సురేఖ, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీలత, మహేష్ శెట్టి, శ్రీనివాస్, బసవరాజు, సత్యం, గౌడ్ బీజేపీ నాయకులు నాగోల్ డివిజన్ అధ్యక్షులు పంగా శ్రీకాంత్, యశ్వంత్, శివకుమార్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, జనవరి 19 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు అసద్‌బాబానగర్, బహదూర్‌పుర ఒహెచ్ ఫీడర్ల పరిధులలో, పాతబస్తీ పటేల్ నగర్ ఫీడర్ పరిధిలో 10 నుంచి 12 గంటలు వరకు, గౌలిపుర ఫీడర్ పరిధిలో 12 నుంచి 2 గంటలు వరకు, ఛత్రినాక ఫీడర్ పరిధిలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

## శ్రీనగర్ ఎంపిని కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, జనవరి 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ నూర్‌ఖాన్ బజార్ ప్రాంతలో తెలంగాణ షియా యూత్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనగర్ పార్లమెంట్ సభ్యులు(కాంగ్రెస్) ఆగా సయ్యద్ రుహుల్లా మెహది పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి రజా అలీ మీర్జాతో పాటు పలువురు శ్రీనగర్ ఎంపి ఆగా సయ్యద్ రుహుల్లా మెహదిని కలిశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ షియా యూత్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షులు సయ్యద్ హమిద్ హుస్సేన్ జాఫ్రీ, జాన్ బిన్ సాబేర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పోరాడి విజయం సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు

**సైఫాబాద్, జనవరి 19 ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వ కుట్రలను భగ్నం చేస్తూ సంవత్సరాల తరబడి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడి కార్మికులు విజయం సాధించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అభినందించారు. ఈ స్టీల్ ప్లాంట్‌ను సొంతం చేసుకోవడానికి పథకం రచించిన అదానీ అశలు కార్మిక వర్గం అడియాశలు చేసిందని ఆయన అన్నారు. గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ఓడిపోయి కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ప్లాంట్ అంశం డోలాయమానంలో ఉందని, ప్రస్తుత కేంద్ర మంత్రి కుమారస్వామి గత ఏడాది స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి పోరాటం చేస్తున్న కార్మికులకు ప్లాంట్ ప్రైవేటుపరం కాదని ప్రకటించిన తరువాతే కార్మికులలో కొత్త అశలు చిగురించాయని చెప్పారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వ విశాఖ స్టీల్‌ను ప్రైవేటు పరం చేయబోమని మంత్రి ప్రకటించడం ఇందుకు కేంద్ర మంత్రి వర్గం అమోదం తెలిపి 11 వేల కోట్ల రూపాయలు ప్రకటించడం కార్మికవర్గంలో ఆనందం వెల్లివిరిసిందన్నారు. కార్మికులపోరాటానికి మద్దతుతెలిపిన రాజకీయ పార్టీలను, నాయకులను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ఆయన తెలిపారు.

## కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**చిక్కడపల్లి, జనవరి 19 ప్రభాతవార్త:** మార్క్స్ పూలే అంబేద్కర్ వంటి మహనీయుల మార్గదర్శి అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) క్యాలెండర్ ఉందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పివి. నిరంజన్ రెడ్డితో కలిసి ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ 20 ఏండ్లుగా కేవీపీఎస్ క్యాలెండర్ ముద్రించబడుతుందన్నారు. మహనీయుల చిత్రపటాలు వారి విలువైన నినాదాలతో నేటి తరం స్ఫూర్తి పొందే విధంగా క్యాలెండర్ ముద్రించడం అభినందనీయమన్నారు. కేవీపీఎస్ అట్టడుగు వర్గాల ఐక్యత కోసం కృషి చేస్తుందన్నారు సామాజిక న్యాయాన్ని సమాజానికి పంచడం మనుస్మృతి ఆధిపత్య బావజాలంపై ప్రతిఘటన ఉద్యమాలు జరగాలన్నారు క్యాలెండర్ ముద్రణపై పలువురు ప్రశంసలు చెప్పారని అన్నారుఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పి వి నిరంజన్ రెడ్డి, కార్యదర్శి సైకం మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వడిత్య కళ్యాణ్ నాయక్, డి వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్. మాజీ ప్రెసిడెంట్లు ఎస్ రమేష్ రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రావు, వాకర్స్ క్లబ్ సభ్యులు ఐ కిషన్ రావు, ఎం డి రఫీ ఖాన్, నిమ్మల రాజశేఖర్, రాజేశ్వర్, రఘురాం రెడ్డి, వీరయ్య, రమేష్. నగేష్, మోహన్, అశోక్, రవికుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## 5న దేశవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలి

**సైఫాబాద్, జనవరి 19 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా జరిగే నిరసన ఆందోళనల్లో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ అధ్యక్షత వహించారు. దేశంలో బడా కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తుల అండదండలతో మూడోవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం తన అహంకారపూరిత, పాశవిక, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగించడాన్ని కార్యవర్గ సమావేశం తీవ్రంగా ఖండించింది. వచ్చే బడ్జెట్‌లో అసంఘటితరంగ కార్మికుల ప్రయోజనాల కోసం ఒక లక్ష కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేసింది. కేంద్రం తీసుకువచ్చిన 4 లెబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనలలో యావత్ కార్మికవర్గం పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఎన్నికల్లో ఇచ్చిన కొన్ని హామీలను అమలు పరచడానికి కృషి చేస్తున్నప్పటికి ముఖ్యంగా ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కారించడంలో విఫలం చెందిందని సమావేశం ఆరోపించింది. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు ఉజ్జని రత్నాకర్‌రావు, బి.చంద్రయ్య, పి.ప్రేమ్‌పావని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.డి.యూసఫ్

## పసుల రామ్మూర్తిపై కేసు నమోదు చేయాలి



త్రీ టౌన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు, జనవరి 19, ప్రభాతవార్త :**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, వర్గీకరణ కోసం దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగను రాళ్లతోకొట్టి చంపుతామని బెదిరిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పసుల రామ్మూర్తిపై కేసు నమోదుచేసి చట్టపరంగా శిక్షించాలని ఆదివారం సిద్దిపేట త్రీ టౌన్‌లో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి కొలిమి మల్లేశం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. విద్వేషపూరితమైన వ్యాఖ్యాలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న రామ్మూర్తిపై వెంటనే చట్ట పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కనకయ్య, ముక్కర సంజీవ్, కనకయ్య, దాకని యాదగిరి, దండుశ్రీనివాస్, బొల్లంశివకుమార్ పాల్గొన్నారు.
చిన్నకోడూరులో..
ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగను చంపుతామని కుట్ర పూరిత వ్యాఖ్యాలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు
పసుల రామ్మూర్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లమారి రంగరాజం డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాజ్యాంగ బద్ధంగా ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా తీర్పు చెప్పినప్పటికీ మాలలువ్యతిరేకించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీ ఎస్ ప్రతినిధులు తిరుపతి, లక్ష్మణ్, జంగపల్లి రాజు, కొలన్ నరేష్, ఎర్ర మురళి తదితరులు పాల్గొన్నారు.

## నముండ్ల రామచంద్రం మృతి

**సంతాపం తెలిపిన హరీష్, బిఆర్ఎస్ నాయకులు**



రామచంద్రం మృత దేహానికి నివాళులర్పిస్తున్న హరీష్‌రావు

**చిన్నకోడూరు, జనవరి 19, ప్రభాతవార్త :**
చిన్నకోడూరు మండల మైలారం గ్రామానికిచెందినమాజీ ఎంపిపి, ప్రస్తుత డిసిసిబి డైరెక్టర్ నముండ్ల రాచంద్రం ఆదివారం ఉదయం మరణిం చారు. అనారోగ్యంతో బాధపడి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈవిషయం తెలుసు కున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మైలారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం రామచంద్రం మృత దేహానికి పూల మాలలు వేసి పార్టీ కండువా కప్పి నివాళులర్పించారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో, పార్టీలో చేసిన సేవలు మరవలేనివన్నారు. రామచంద్రం మరణం బిఆర్ఎస్ పార్టీకితీరని లోటన్నారు. అలాగే మండల పరిధిలోని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధపార్టీల నాయకులు పెద్ద యెత్తున తరలివచ్చి నివాళులర్పించారు.

## నిరుపేదలకు దుప్పట్ల పంపిణి



నిరుపేదలకు దుప్పట్లను పంపిణి చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సెన్

**రాయపోల్ జనవరి19ప్రభాతవార్త:**
తానురాజకీయాల్లో ఉండి ప్రజాసేవ చేస్తానని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సెన్ అన్నారు. అదివారం రాయపోల్ మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో రాయపోల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 300 మంది నిరుపేదలకు హైదరాబాద్‌కు చెందిన దాతలు శాంతిలాల్ జైన్, ఉత్తం జైన్, చంపాలాల్ జైన్, దుదారాం దేవ్ సాయి, రాజ్‌కుమార్ యాదవ్, తదితరులతో కలిసి దుప్పట్లను అందజేసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సెన్
మాట్లాడుతూ.. తాను వివిధ ప్రాంతాల్లోని దాతలను సంప్రదించి వారి సహాకారంతో దుబ్బాక నియోజకవర్గ నిరుపేదప్రజలకు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడతానని అన్నారు. త్వరలోనే దుబ్బాక నియోజక వర్గంలోని అన్ని మండలాలకుమరిన్ని ఫ్రిజర్లు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సికిందర్, మండల బీఅర్ఎస్ పార్టీ అధ్యక్షులువెంకటేశ్వర శర్మ, మాజి జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మాజి మండల కోఆప్షన్ సభ్యులు పర్వేజ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, రాజిరెడ్డి, మంజూరు, మాజీ సర్పంచ్‌లు కరుణాకర్, రామోళ్ల స్వామి, రాంచంద్రం, నాయకులు కర్నాల సత్యనారాయణ, బాల్ నర్సింలు, రాజారాం మధు, సంతోష్, కుమార్, అక్బర్, శ్రీను, రాజు, నవీన్ పాల్గొన్నారు

## బిసి కులాలు ఐక్యతగా ఉండి సత్తా చాటాలి

**బిసిసంఘం నాయకులు రాములు**

**జహీరాబాద్, జనవరి 19 ప్రభాతవార్త:** బిసి కులాల వారు ఐక్యతగా ఉండి తమసత్తా చాటాలని బిసిసంఘం నాయకులు ఉగ్గెల్లి రాములు అన్నారు. ఆదివారం జహీరాబాద్ నియోజకవర్గ బీసీసంఘాల ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని స్థానిక హోటల్‌లో బిసి సంఘంసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ నియోజక వర్గంలోని బిసికులాలు ఐక్యంగాఉండాలని ఆయన పిలుప నిచ్చారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులుశంకర్ ముదిరాజ్, సత్య నారాయణ, పద్మశాలి సంఘం నాయకులు గడ్డం సత్య నారాయణ, పద్మశాలి సంఘంనాయకులు జనార్ధన్, జ్యోతిపండలపూల్ సంతోష్, నాయిబ్రాహ్మణ సంఘం నుంచి ప్రభున్యాయవాది, దత్తాత్రి రజకసంఘం నాయకులు సందీప కుమార్, విశ్వకర్మ సంఘం నాయకులు భాస్కర్ మాణయ్య ముదిరాజ్, వివిధ కులా సంఘల నాయకులు మాణయ్య, ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ బక్కయ్య, మాణయ్యఫీల్డ్‌మెన్, పరశురాం, కావేరి సుభాష్, తుకారాం పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒకరికి అవగాహన అవసరం

**రామచంద్రాపురం, జనవరి 19, ప్రభాతవార్త:**
సైబర్ నేరాలపై ప్రతి ఒకరికి అవగాహన అవసరమని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీలు సూచించారు. ఆదివారం తెల్లాపూర్ పరిధిలోని రాజ్ పుష్ప క్లబ్ హౌస్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీలో డిజిటల్ అరెస్టుపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజిపి శిఖా గోయెల్ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీలు హరికృష్ణ, కె.వి.ఎం ప్రసాద్, సూర్య ప్రకాష్, సంగారెడ్డి జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి లు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు డిజిటల్ అరెస్టులపై అవగాహన కలిగి ఉండాలని, పోలీసులు ఎవరు డిజిటల్ రూపంలో అరెస్టులు చేయరని, డిజిటల్ అరెస్టు పేరుతో ఫోన్ కాల్ వస్తే సైబర్ నేరగాళ్ల నుండి వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టకూడదని, గుడ్డిగా అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదని తెలిపారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరుగుతే వెంటనే 1930 కు ఫోన్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన గంట వ్యవధిలో (గోల్డెన్ అవర్) లో ఫిర్యాదు చేసినట్లయితే నగదు సీజ్ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ సైబర్ హుడ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, సభ్యులు మదన్మోహన్, వేణుగోపాల్ రెడ్డి, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**విజేతలకు బహుమతుల ప్రధానం చేసిన ఎమ్మెల్యే సునీతా రెడ్డి**



క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్ జనవరి 19. ప్రభాతవార్త :**
క్రీడల్లో ఆట పోటీల్లో గెలుపు ఓటములు సహజమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని జూనియర్ కాలేజ్ ఆవరణలో గత వారం రోజులుగా సుల్తాన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నర్సాపూర్ ప్రీమియర్ లీగ్ ఎన్ పి ఎల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిగా పాల్గొన్నఎమ్మెల్యే సునీత రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్‌లో ప్రతి సంవత్సరం ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.
ఈ క్రీడా పోటీలు క్రీడాకారులకు ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. ఈ క్రీడల్లో గెలుపుఓటములు సమానంగా తీసుకొని గెలిచినవారు పొంగిపోకుండా ఓడినవారు కుంగిపోకుండా సహజంగా తీసుకోవాలన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నర్సాపూర్‌లో నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ఎమ్మెల్యే సునీతారెడ్డి అభినందించారు. ఈ మేరకు ఈ క్రికెట్ పోటీలో ఫైనల్ మ్యాచ్ లో సుభాష్ యాదవ్ జట్టు, సూర్య ఇంటీరియర్స్ జట్టు తలపడ్డాయి. ఇందులో సుభాష్ యాదవ్ జట్టు విజయం సాధించింది ఈ టోర్న మెంటులో సుభాష్ యాదవ్ జట్టు నాలుగవసారి విజయం సాధించడం విశేషం. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్ నాయకులుషేక్ హుస్సెన్, రింగుల ప్రసాద, తొంట వినయ్, మహమ్మద్, నాయకులు కార్యకర్తలు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

**పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్**

**పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన**

**నర్సాపూర్ జనవరి 19. ప్రభాతవార్త :** ఉపాధ్యాయులపై దాడులు చేయడం హేయమైన చర్య అని పేర్కొంటూ ప్రధానోపాధ్యాయులు రాములు పై దాడులు చేసిన దుండగులను శిక్షించాలని పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్ అన్నారు. ఆదివారం నాడాయన నర్సాపూర్ లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 23న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తొక్కుగూడా జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పాఠశాల ప్రధానో పాధ్యాయులు కంబాలపల్లి రాములుపై కొందరు వ్యక్తులు దాడులు చేశారన్నారు. ఆ వ్యక్తులు పాఠశాలకు వచ్చి హెచ్ఎం రాములు పై విచక్షణారహితంగా దాడికి పాల్పడటాన్ని పిఆర్‌టియు టీఎస్ మెదక్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు దాడికి పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయనడిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఈ దాడిని నిరసిస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలుధరించి ఉపాధ్యాయులు అన్ని పాఠశాలల్లో నిరసన వ్యక్తం చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ మెదక్ జిల్లా శాఖ పిలుపునిచ్చిందని సామ్య నాయక్ తెలిపారు.

# పేదలకు ఎంతో ఉపయోగం సిఎంఆర్ఎఫ్

**ఎమ్మెల్యే సునీతా రెడ్డి**

**నర్సాపూర్ జనవరి 19. ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు 2 లక్షల ఎల్ ఓ సి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందినచింతల రాణి అనారోగ్యానికి గురైనందున హైదరాబాదులోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకుగాను ఆపరేషన్ నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుండి మంజూరైన 2లక్షల ఎన్‌ఓసి పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూపేదలకుఅత్యవసరంగాఆస్పత్రిలో చికిత్స పొందు తున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఈ మేరకు బాధితులు సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ తాజా మాజీ సర్పంచ్ ఉప్పలవు అశోక్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పలవు లక్ష్మి నరసయ్య, చింతల అంజయ్య, చింతల విట్టల్, బోయిని లింగం తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ నుండి మంజూరైన 2లక్షల ఎన్ఓసి పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

# పబ్లిక్ స్కూల్ లో రాష్ట్రస్థాయి ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలు

**ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు**





. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, జనవరి 19, ప్రభాతవార్త:**
ప్రభుత్వం పెద్ద మనస్సు చేసుకొని ఆర్చరీ క్రీడాకారులకు ప్రోత్సహం అందిస్తే, ఒలింపిక్ పతకం సాధిస్తామని తెలంగాణా ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఒలింపిక్ పతకాలే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో త్వరలో ఆర్చరీ అకాడమీ నెలకొల్పుతున్నట్లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రతినిధి, సంగారెడ్డి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆదివారం కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి నాలుగవ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అర్చరీ చాంపియన్ షిప్ పోటీలను తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఒలింపిక్ క్రీడల్లో పతకాలు సాధించేందుకు రూపొందించిన ఎనిమిది ప్రాధాన్యత క్రీడల జాబితాలో ఆర్చరీని చేర్చటం హర్షణీయం అన్నారు. వచ్చే నెల ఫిబ్రవరిలో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఈ పోటీల ద్వారా ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఏర్పడా నాటి నుండీ ప్రభుత్వం నుండీ అనుకున్న స్థాయిలో ఆదరణ లభించక పోయిన, రాష్ట్రం తరపున చికిత, పూర్ణచందర్ అనే వర్తమాన క్రీడాకారులు ఇద్దరు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గొప్ప విషయం అన్నారు. ఈఇద్దరు క్రీడాకారులు రానున్న రోజుల్లో పతకాల పంట పండించడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ పిల్లలు క్రీడల్లో రాణించాలని అని అనుకునే తల్లితండ్రులు ఆర్చరీని గనుక ఎంచుకుంటే క్రీడారంగంలోపిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని గ్రహించాలన్నారు. తెలంగాణ ఆర్చరీ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించేందుకు మౌలిక సదుపాయాలను కల్పించి త్వరలో అకాడమీ నీ ప్రారంభిస్తామని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రతినిధి పవన్ కళ్యాణ్ తెలియజేశారు. క్రీడాకారులకు శిక్షణ తోపాటు, శారీరిక, మానసిక దృఢత్వం సాధించేందుకు ఈ అకాడమీ నెలకొల్పుతున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు.
రానున్న కాలంలో జాతీయస్థాయిలో తెలంగాణను ఆర్చరీలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆర్చరీలో తెలంగాణ క్రీడాకారులు ఒలంపిక్ పతకాలు సాధించాలనే పట్టుదలతో రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. డిల్లీ పబ్లిక్ స్కూల్ లో చదువుకునే విద్యార్థులు ఆర్చరీ క్రీడను స్పోర్ట్స్ ప్రొఫెషన్ గా ఎంచుకుంటే వారి ఫీజ్ లో 50 శాతం రాయితీ కల్పిస్తామని పవణ్ కళ్యాణ్ వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచి, తనను సంగారెడ్డి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్చరి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కోశాధికారి సత్యప్రసాద్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కొల్లూరు అధిపతి భీమ్ సేన్, ఉప అధిపతి ప్రణయ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఏజీఎం రవి పాల్గొని ప్రతిభ చూపిన అర్చరీలను అభినందించారు.

# సనాతన ధర్మంపై దాడిని కలికట్టుగా ఎదుర్కోవాలి

**-దేశంలో సనాతన బోర్డు ఏర్పాటు చేయాలి**

**ప్రభుత్వాలు అవసరమైన చట్ట సవరణలు చేయాలి**

**-గజ్వేల్‌లో సనాతన ధర్మ జాగృతి మహాసభ సనాతన ధర్మ**

**-హాజరైన మఠాధిపతులు, అధిక సంఖ్యలో పాల్గొన్న హిందువులు**

**గజ్వేల్ జనవరి19ప్రభాతవార్త:**
దేశానికి మూలమైన సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి సనాతన బోర్డును ఏర్పాటుచేయాలని వివిధ మఠాల పీఠాధిపతులు, మఠాచార్యులు, ధర్మ ప్రవచనకర్తలు ఏకకంఠంతో నినదించారు. సనాతన బోర్డు ఏర్పాటు లక్ష్యంగా గజ్వేల్‌లో అదివారంసనాతన హిందూ ధర్మజాగృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభను నిర్వహించారు. కార్యక్రమానికి వీరధర్మజ పీఠాధిపతి వీరద్వాజ స్వామి, ఇందూరు దత్త పీఠాధిపతి ఇప్పరాయల హరదాస స్వామి, శివపార్వతి మాత, సద్గురు మహాదేవ స్వామి తదితరులుహాజరై సనాతనధర్మం గురించి ప్రసగించారు. నేడు దేశవ్యాప్తంగాఅనేకచోట్లసనాతనధర్మంపై జరుగుతున్న దాడిని ఖండించారు. అన్యమతపరమైన దేశంగా మార్చడానికి కుట్రలు పన్నుతున్నఅన్యమత వర్గాల ప్రయత్నాలను ఖండిస్తూ, అతి ప్రాచీనము, నిత్యనూతనము, విశ్వశాంతిని కోరేసనాతన ధర్మపరిరక్షణకుకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవసరమైన చట సవరణల ద్వారా సహాకరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు .అన్ని హిందూదేవాలయాలపై ప్రభుత్వ పెత్తనాన్ని ఎత్తి వేయాలని, దీని బదులుగా జాతీయస్థాయిలో సనాతనధర్మ పరిరక్షణ బోర్డునుఏర్పాటు చేసి అందులో ప్రముఖ పీఠాధి పతులు, ధర్మాధికారులు, ధర్మ చారకులు, వేదపండితులు, హిందూ మేథావి వర్గాలకుచెందిన ప్రముఖులను సభ్యులుగా నియమించి ఈ బోర్డు నియంత్రణలోనే ఈ దేశంలోని అన్ని హిందూ దేవాలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు పనిచేసే విధంగా చట్టం చేయాలన్నారు. ఈ జాతీయ అనుబంధంగా ప్రతి రాష్ట్రంలోను రాష్ట్రస్థాయి సనాతనధర్మ పరిరక్షణ బోర్డులను ఏర్పాటు చేసి సభ్యులనునియమించి వారి ద్వారా ఆయా రాష్ట్రంలోని హిందూ దేవాలయములు, ఆర్థిక సంస్థలు నియంత్రించబడేలా చట్టం చేయాలన్నారు.
గో హత్యను మానవహత్యతో సమానంగాశిక్షాస్మృతిని సవరించాలని గో-ఆధారిత వస్తువుల ఉత్పత్తులు ప్రొత్సహిస్తూ ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలకు సబ్సిడిఅందించి ప్రొత్సహించాలని, అన్ని గోవధ శాలలను తక్షణమే మూసివేయాలని అన్నారు. ఒకే దేశం- ఒకే చట్టం అమలుచేయాలని, ఇతర అన్ని మైనారిటీల ప్రత్యేక వ్యక్తిగత చట్టాలను రద్దు చేయాలన్నారు. భారతీములందరూ ఒకే చట్ట పరిధిలో ఉండలన్నారు .ఇప్పటివరకూ వక్ఫ్ చట్టం ద్వారా ఆక్రమించిన అన్ని హిందూ స్థిర, చరాస్తులను పరిశీలించి ఆయా సంస్థలకువ్యక్తులకు సంఘములకు తిరిగి చట్టబద్ధంగా అప్పగించా లన్నారు. అలాగే హిందూవులంతా తమ పిల్లలకు సనాతన ధర్మంగురించి చిన్ననాటి నుండే బోధించాలని సూచించారు. అలాగే చిత్రగుప్త యూట్యూబ్ ఛానల్, దేవుళ్ల ఛానల్ సనాతన ధర్మంపై జరుగుతున్న దాడుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగం జిల్లాల దార్మిక సంస్థల ప్రతినిధులు, హైందవ సోదరుల సమూహం, అధిక సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.





గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మహాసభలో మాట్లాడుతున్న దృశ్యం



గజ్వేల్‌లో మహాసభకు భారీ సంఖ్యలో హజరైన హిందువులు

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్‌పూర్, జనవరి 19 ప్రభాతవవార్త:**
అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు సాయి అంబికా కాలనీలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పంచతత్వ పార్కును పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్‌లు ప్రారంభించారు. అనంతరం 16వ వార్డు పరిధిలోని నరగ్రూడెం ఇండస్ వ్యాలీ కాలనీలో 45 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అమీన్‌పూర్ మండలం మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ జ్యోతి రెడ్డి, స్థానిక కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పసుల రామ్మూర్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**ధూళిమిట్ట, జనవరి 19, ప్రభాతవార్త :**
ఎమ్మార్పీఎస్‌వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను కొట్టి చంపుతామని బెదిరింపులకు పాల్పడుతూ ప్రకటనలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో మద్దూరు, ధూళిమిట్ట మండలాల ఇన్‌చార్జ్ సుందరగిరి భాస్కర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ధూళిమిట్ట ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు నల్లరాజేష్ మాదిగ, మండల అధికార ప్రతినిధి నాగుపలపల్లి సంపత్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి మాదాసు ప్రశాంత్ మాదిగ, మండలసహాయక కార్యదర్శి పోతరాజు కనకయ్య మాదిగ, కార్యదర్శి గొల్లూరి రాజు మాదిగ తదితరలు ఉన్నారు.

## రైతు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్**

**నర్సాపూర్ జనవరి 19. ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విన్సెంట్ వినయ్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ మండలంలోని అహ్మద్ నగర్ గ్రామంలో జరుగుతున్న రైతు భరోసా సర్వే ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విన్సెంట్ వినయ్ మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములు అన్నింటికీ పరిమితి లేకుండా రైతు భరోసా సహాయం అందించడం జరుగుతుందన్నారు. రైతు భరోసా సర్వే నిర్వహించే అధికారులు సర్వేను పకడ్బందీగా నిర్వహించి అసలైన అర్హులను గుర్తించే విధంగా నిర్వహించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏ ఈ ఓ లు తేజస్విని, ప్రసాద్, ఎం.ఆర్.ఐ సత్తుస్వామి, పంచాయతీసెక్రెటరీ పాల్గొన్నారు.

## దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలి

**నర్సాపూర్ ఎస్ఐ లింగం**

**నర్సాపూర్ జనవరి 19. ప్రభాతవార్త :** బ్యాంకర్లు బ్యాంకుల్లో దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్ ఐ బి. లింగం అన్నారు. శనివారం సాయంత్రం నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ లింగం ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్, సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్లతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై బి. లింగం మాట్లాడుతూ బ్యాంకర్లు బ్యాంకుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులను, ప్రతి బ్యాంకు వద్ద అలాగే ఏటీఎంల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకోసం బ్యాంకులో అవసరమైన ఏర్పాట్ల చర్యలను చేపట్టాలని ఆయన సూచించారు. బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా బ్యాంక్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సై లింగం సూచించారు. బ్యాంక్ అధికారులు బ్యాంకుల్లో వినియోగదారులకు అవసరమైన చర్యలు తీసుకుంటే బ్యాంకులపై వారికి పూర్తి నమ్మకం చేకూరుతుందని ఎస్ఐ బి.లింగం తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పట్టణంలోని అన్ని బ్యాంకుల అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

## గోదానం చాలా విశిష్టమైనది

**చిన్నశంకరంపేట, జనవరి 19, ప్రభాతవార్త:**గోదానం చాలా విశిష్టమైనదని ఎస్ఐ నారాయణగౌడ్ అన్నారు. ఆదివారం నాడు మండల పరిధి ఖాజాపూర్ తండాలో సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో అహిల్యా ఉమెన్స్, సనాతన హిందూ సంఘ్ సహకారం, శ్రీ సమర్థ కామదేను గోశాల వారి సహయంతో 10 జతల ఆవులను ఖాజాపూర్ తండా, సంకాపూర్ తండా రైతులకు పైలట్ ప్రాజెక్టు కింద పది మంది రైతులకు పంపిణీ చేశారు. 200 మంది మహిళలకు చిరలను పంపిణి చేశారు. ఎస్ఐ నారాయణగౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సెంద్రియ వ్యవసాయాన్ని పక్కనపెట్టి ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ రసాయనిక వ్యవసాయాన్ని చేస్తున్నామని, దీని వల్ల మానవ వ్యవస్థ అస్తవ్యస్తం అయిందన్నారు. అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న శివను ఎస్ఐతో పాటు స్వచ్ఛంధ సంస్థ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షులు డా,, శివ నాయక్, అహిల్యా ఎమెన్ ఫౌండేషన్ అధ్యక్షులు డా,, పూనమ్, సనాతన హిందూ సంఘం అధ్యక్షులు గీటేష్ కాటవాచ్‌చ్టుహెచ్ చాణక్య దత్తాత్రేయ, బిజెపి జిల్లా నాయకులు నందారెడ్డి, రిటైర్డ్ ఆఫీసర్ గన్నే రాజిరెడ్డి, పశు వైద్యాధికారి గీతా మాలిక డా,, మానెగల్ల భాస్కర్, కృషి విజ్ఞాణ కేంద్ర శాస్త్ర వేత్తలు డా,,రవి, గ్రామ మాజీ సర్పంచి జంకు, నాయకులు లాల్య ,తారచంద్, వివిధ గ్రామాల పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**చిన్నశంకరంపేట, జనవరి 19, ప్రభాతవార్త:**విద్యుత్ ఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధి శాలిపేటలో ఆదివారం నాడు చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేష్(47) ఉదయం తన వ్యవసాయ పోలానికి నిరు పెట్టడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి తిరికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలానికి వెళ్లి చూడగా మోటార్ స్టాటర్ వద్ద పడి ఉన్నాడు. విద్యుత్ మోటర్ స్టాటర్ మరమ్మత్తులు చేస్తుండగా షాక్ కొట్టి చనిపోయాడని, మృతుని భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

## కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వే

**చిన్నశంకరంపేట, జనవరి 19, ప్రభాతవార్త:**మండలంలోని వివిధ గ్రామాలలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల ఇంటికి వెళ్లి ఆదివారం సర్వేను పంచాయతీ అధికారులు నిర్వహించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని పంచాయతీ కార్యదర్శి సంతోష్ తెలిపారు.

## ద్విచక్రవాహన ప్రమాదంలో మహిళకు గాయాలు

**చిన్నశంకరంపేట, జనవరి 19, ప్రభాతవార్త:**బైక్ డి కొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి అంబాజీపేట శివారు వద్ద ఆదివారం నాడు చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన యాదమ్మ ఉదయం పొలం వద్దకు వెళ్లి తిరిగి వెళ్తుండగా మెదక్ వైపునకు వెళ్తున్న కొండాపూర్ గ్రామానికి చెందిన శ్రీను ద్విచక్ర వాహనంతో యాదమ్మను డీ కొట్టడంతో యాదమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు యాదమ్మను ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

## ఎల్‌వోసిని అందచేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్ రూరల్, జనవరి 19, ప్రభాతవార్త:**మండల పరిధి లింగాపూర్ గ్రామానికి చెందిన చింతల రాణి కి పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతుంది. ఆపరేషన్ నిమిత్తం మంజూరైన రెండు లక్షల రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని హైదరబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సునితారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం అవసరమున్న పేదలకు ఈ సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు ఈ కార్యక్రమంలో లింగాపూర్ తాజా మాజీ సర్పంచ్ ఉప్పలపు అశోక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పలపు లక్ష్మినర్సయ్య, చింతల అంజయ్య, చింతలవిటల్, బోయినిలింగం ఉన్నారు.

